క్లుప్తంగా

చెకుముకి పోటీల్లో విద్యార్థుల ప్రతిభ



విద్యార్థులను అభినందిస్తున్న నరసింహారావు

తుని: రాష్ట్ర స్థాయి చెకుముకి పోటీల్లో స్థానిక శ్రీప్రకాష్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఈ నెల 9, 10 తేదీల్లో విశాఖపట్నం పాలిటెక్నిక్ కళాశాలలో రాష్ట్రస్థాయి చెకుముకి సైన్స్ సంబరాలు జరిగాయి. రాష్ట్ర వ్యాప్తంగా 52 బృందాలు పాల్గొన్న ఈ పోటీల్లో శ్రీప్రకాష్ విద్యార్థులు ఎస్.కిరణ్, ఎం.సాత్విక్, ఒ.సాయిశ్రావణ్ జయదీప్ ఉత్తమ ప్రతిభ కనబరిచి ద్వితీయ స్థానం సాధించారని సీనియర్ ప్రిన్సిపల్ మూర్తి తెలిపారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత నరసింహారావు, అధ్యాపకులు అభినందించారు.

విద్యార్థులకు వాలీబాల్ పోటీలు



తునిలో వాలీబాల్ ఆడుతున్న విద్యార్థులు

తుని: స్థానిక రోటరీక్లబ్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రంగం యువజనోత్సవాల్లో భాగంగా సోమవారం విద్యార్థులకు వాలీబాల్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో తుని పట్టణం, రూరల్ ప్రాంతాల్లోని పలు పాఠశాలలకు చెందిన విద్యార్థులు పాల్గొని సత్తా చాటారు. శ్రీప్రకాష్ కాలేజీ గ్రౌండ్, రాజా కాలేజీ మైదానాల్లో సీనియర్, జూనియర్ విభాగాల్లో పోటీలు నిర్వహించారు. కార్యక్రమంలో రోటరీ ప్రతినిధులు వీర్రాజు, కిషోర్‌రెడ్డి, నాగిరెడ్డి, గౌరీశంకర్, ప్రసన్నకుమార్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పస్వాములకు భిక్ష ఏర్పాటు



భిక్షను ప్రారంభిస్తున్న ముద్రగడ కుటుంబ సభ్యులు

కిర్లంపూడి: అయ్యప్ప, శివ మాలలు ధరించిన భక్తులకు వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకులు, మాజీ మంత్రి ముద్రగడ పద్మనాభం నివాసంలో సోమవారం భిక్ష ఏర్పాటు చేశారు. తొలిత ముద్రగడ పద్మనాభం, పద్మావతి, యువ నాయకుడు ముద్రగడ గిరిబాబు, సిరి దంపతులు అయ్యప్పస్వామికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం అయ్యప్ప దీక్ష నియమావళిని పాటించి భక్తి శ్రద్ధలతో స్వాములకు భోజనం (భిక్ష) వడ్డించారు. ముద్రగడ కుటుంబ సభ్యులు స్వాములకు తాంబూలం అందజేసి వారి ఆశీర్వాదం పొందారు.

ఘనంగా లక్ష రుద్రాక్ష పూజ

ప్రత్తిపాడు: స్థానిక పోలిశెట్టివారి వీధిలో సోమవారం లక్ష రుద్రాక్ష పూజ ఘనంగా నిర్వహించారు. వేదపండితుడు తేజోమూర్తుల సుబ్రహ్మణ్యశర్మ ఆధ్వర్యంలో 18 మంది రుత్విక్కులు పోలిశెట్టి దొరబాబు దంపతులతో విఘ్నేశ్వరుడు, కార్తిక దామోదరునికి విశేష పూజలు చేయించారు. అనంతరం లక్ష బిల్వార్చన, లక్ష రుద్రాక్ష పూజ, చండీ హోమం, లక్ష్మీ గణపతి హోమం, ఏకవార రుద్రాభిషేకం, అన్నాభిషేకం నిర్వహించారు. మధ్యాహ్నం అన్న సమారాధన నిర్వహించారు. రాత్రికి జ్యోతిర్లింగార్చన వేడుకగా సాగింది. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎమ్మెల్యే వరుపుల సుబ్బారావు, పార్టీ నాయకులు ముదునూరి మురళీకృష్ణంరాజు, సీతారామరాజు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు

తుని రూరల్: నేషనల్ పేమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (ఎన్‌పీసీఐ) ఖాతాలు తెరిచేందుకు ఈ నెల 12 నుంచి 19 వరకు పోస్టల్‌శాఖ ఆధ్వర్యంలో గ్రామాల్లో ప్రత్యేక క్యాంపులు నిర్వహించనున్నట్టు ఎంపీడీఓ సాయి నవీన్ కుమార్ సోమవారం తెలిపారు. మంగళవారం ఎన్.చామవరం, 13న డి.పోలవరం, కేఓ మల్లవరం, కొలిమేరు, రేఖవానిపాలెం, ఎస్.అన్నవరం, చేపూరు, 14న అటికివానిపాలెలం, వి.కొత్తూరు, కుమ్మరిలోవ, రాపాక, అగ్రహారం, వల్లూరు, 16న దొండవాక, హంసవరం, లోవకొత్తూరు, ఎస్.సూరవరం, తాళ్లూరు, 18న హెచ్.కొత్తూరు, రాజుపే, 19న ఎస్ఎస్‌వీ. నగరంలో ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేసినట్టు ఆయన వివరించారు. పోస్టల్‌శాఖ ఇబ్బంది పాస్ బుక్‌లు జారీ చేస్తారన్నారు.

బాలల సంరక్షణ అందరి బాధ్యత

శంఖవరం: నేటి బాలలే రేపటి పౌరులు అని, బాలలను సంరక్షించుకోల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపైనా ఉందని డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటెక్షన్ యూనిట్ పీఓ విజయ అన్నారు. స్థానిక కేజీబీవీలో సోమవారం బాలికల సంరక్షణంపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా బాలల హక్కులు, చట్టాలు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు తదితర అంశాలపై అవగాహన కల్పించారు.

దోమ కాటు.. పాడికి చేటు

- పాడి పశువుల్లో తగ్గుతున్న పాల దిగుబడి
- ఆందోళన చెందుతున్న రైతులు
- మూగజీవాల ఆరోగ్యంపై మరింత శ్రద్ధ అవసరం



ప్రత్తిపాడులో గేదెల మకాంలో పని చేస్తున్న రైతులు

ప్రత్తిపాడు: దోమ చిన్నదే..పశువులను అది కుట్టినా నష్టం లేదులే అని అశ్రద్ధ చేస్తే పాడి రైతులు పెద్ద మూల్యమే చెల్లించుకోవాల్సి వస్తోంది. దోమ కాటు పాడికి చేటు తెస్తోంది. ఇటీవల కురిసిన వర్షాలకు ఎక్కడికక్కడ మురికి గుంతలు, పశువుల శాలల్లో నీరు నిలిచిపోవడంతో ఆయా ప్రదేశాలు దోమల ఉత్పత్తి కేంద్రాలుగా మారాయి. దీంతో మూగ జీవాలకు దోమల బెడద ఎక్కువైంది. దోమల నుంచి పశువులను సంరక్షించుకుంటే వాటి ఆరోగ్యంతో పాటు పాల దిగుబడి ఆశాజనకంగా ఉంటోంది. లేకపోతే పశువుల ఆరోగ్యం క్షీణించి పాల దిగుబడి గణనీయంగా తగ్గిపోతోందని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

పాడితో జీవనోపాధి

మెట్ట ప్రాంతమైన ప్రత్తిపాడు నియోజకవర్గంలో పాడి రైతులు ఎక్కువగా ఉన్నారు. గ్రామాల్లో అనేక మంది రైతులు ఒకటి, రెండు పాడి గేదెలను మేపుతూ జీవనోపాధి పొందుతున్నారు. ప్రస్తుతం దోమల ఉధృతి తగ్గిపోయి పాల దిగుబడి తగ్గిపోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

దోమలతో మూగజీవాలకు వచ్చే సమస్యలు

- పశువులను దోమలు కుట్టడం వలన పాల దిగుబడి తగ్గుతుంది.



దోమకాటుకు గురైన గేదె

- మేత సరిగా తీసుకోలేవు.
- ఆకలి మందగిస్తుంది.
- మేత తినక పశువులు బలహీనంగా మారతాయి.
- జ్వరం బారిన పడతాయి.
- పశువుల శరీర ఉష్ణోగ్రత పెరుగుతుంది.
- చర్మంపై దురద, దద్దుర్లు, పుండ్లు ఏర్పడతాయి.

రైతులు తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- పశువుల శాలలు, పాకలు శుభ్రంగా ఉంచాలి.



గేదె మూతి మీద వాలిన దోమలు

- సాధ్యమైనంత వరకూ పశువులు కట్టే ప్రదేశం సిమెంట్‌తో ఫ్లోరింగ్ చేసుకోవాలి.
- ఎప్పటికప్పుడు పశువుల మూత్రం, పేడ తొలిగించుకోవాలి.
- గుంతల్లో వ్యర్థాలు, నీరు నిల్వ లేకుండా చూసుకోవాలి.
- ప్రధానంగా పశువుల షెడ్లు, పాకల్లో దోమలు చొరబడకుండా దోమ తెరలు వాడాలి.

నియోజకవర్గంలో పాడి పశువుల వివరాలు

మండలం	ఆవులు	గేదెలు	మొత్తం
ప్రత్తిపాడు	2,935	11,372	14,307
ఏలేశ్వరం	2,440	9,302	11742
శంఖవరం	3,278	8,130	11,408
రౌతులపూడి	2,790	11,688	14,478
మొత్తం	11,443	40,492	51,935

జాగ్రత్తలు పాటించాలి



పాడి రైతులు పశువుల ఆరోగ్యంపై జాగ్రత్తలు తీసుకోవాలి. దోమల వల్ల పశువులకు అనారోగ్యం కలగకుండా, పాడికి నష్టం లేకుండా రైతులు చూసుకోవాలి. ఎప్పటికప్పుడు పశువుల ఆరోగ్యం పరిశీలిస్తూ రక్షించుకోవాలి. వాటి శరీర ఉష్ణోగ్రత పెరిగినా, మేత తినకుండా నలతగా ఉన్నా ఏదో అనారోగ్యం బారిన పడిందని గ్రహించి, వెంటనే పశు వైద్యలను సంప్రదించాలి.

సుంకర వరలక్ష్మి, పశువైద్యాధికారి, ప్రభుత్వ పశువైద్యశాల, ధర్మవరం

- పశువుల పాక చుట్టూ గుబురుగా ఉండే పొదలు తొలగించాలి.
- పశువులు తినగా వదిలేసిన మేతను నిల్వ ఉండకుండా చూసుకోవాలి.
- సాయంత్రం పాకల్లో వేప ఆకుల పొగపెట్టాలి.

జియో ట్యాగింగ్ సేవల నుంచి మినహాయించాలి

ప్రత్తిపాడు: తమను హౌసింగ్ జియో ట్యాగింగ్ సేవల నుంచి మినహాయించాలని ఏఎన్ఎంలు ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు సోమవారం ప్రత్తిపాడులో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఎన్ఎంలు మాట్లాడుతూ మండలంలోని రాచపల్లి, పెద్దిపాలెం, శాంతి ఆశ్రమం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సచివాలయాల్లో సాధారణ సేవలతో పాటు ఆర్‌బీఎస్‌కే ప్రోగ్రాం, పీఎం-జేఏవై తదితర సర్వేల్లో ఇప్పటికే తాము నిమగ్నమయ్యామని చెప్పారు. రెండు రోజుల్లో క్యాన్సర్ సర్వే కూడా చేయాల్సి ఉన్నందున తమపై పని ఒత్తిడి ఎక్కువైందన్నారు. ఈ నేపథ్యంలో హౌసింగ్ జియో ట్యాగింగ్ విధులనుంచి తమకు మినహాయింపు ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో రాచపల్లి, పెద్దిపాలెం, శాంతి ఆశ్రమం పీహెచ్‌సీల ఏఎన్ఎంలు జి .పద్మ, బీఎస్ లక్ష్మి, కె.వరలక్ష్మి, ఎం.సత్యవతి, టి.కమలమ్మ, పి.వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.



ప్రత్తిపాడులో ఎంపీడీఓ ఎంవీఆర్ కుమార్‌బాబుకు వినతిపత్రం అందజేస్తున్న ఏఎన్ఎంలు

అరుణాచలేశ్వరస్వామికి అన్నాభిషేకం



రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి ఆలయంలో అన్నాభిషేకం చేస్తున్న పండితులు

ప్రత్తిపాడు రూరల్: మండలంలోని రాచపల్లి అరుణాచలేశ్వరస్వామి క్షేత్రంలో స్వామివారికి సోమవారం అన్నాభిషేకం కన్నులపండువగా జరిగింది. పండితులు స్వామివారికి మృత్యుంజయ హోమం, మహన్యాస పూర్వక రుద్రాభిషేకం, పూర్ణాహుతి, ఆకాశ దీపోత్సవం వంటి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ వేడుకను తిలకించేందుకు పరిసర గ్రామాల భక్తులు భారీ ఎత్తున భక్తులు తరలివచ్చారు. మహానివేదన అనంతరం మధ్యాహ్నం ఆలయ ప్రాంగాణంలో భారీ అన్నదానం నిర్వహించారు. పరిసర గ్రామాల నుంచి తరలివచ్చిన మూడు వేల మంది భక్తులు అన్నప్రసాదాన్ని స్వీకరించారు. శ్రీరమణా సేవాశ్రమ పీఠాధిపతి స్వామి రామానంద ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అల్లరి వేషాలు వేస్తే కఠిన చర్యలు

జగ్గంపేట: స్థానిక బస్టాండ్‌లో విద్యార్థులు అల్లరి వేషాలు వేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు హెచ్చరించారు. జగ్గంపేట బస్టాండ్‌లో సోమవారం బస్సుల కోసం వేచి చూస్తున్న విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. విద్యార్థులు చదువు కోసం వివిధ గ్రామాల నుంచి జగ్గంపేట వచ్చి వెళుతున్నారన్నారు. కాగా బస్సుల కోసం వేచి ఉన్న సమయంలో ప్రవరిస్తున్న తీరుపై పలు ఆరోపణలు వినిపిస్తున్నాయని అన్నారు. విద్యార్థినుల పట్ల అసభ్యకరంగా ప్రవర్తిస్తే సహించేది లేదన్నారు.

విద్యార్థులకు అవగాహన సదస్సు

జగ్గంపేట ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు మహిళల భద్రత, రక్షణపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. జగ్గంపేట ఎస్సై రఘునాథరావు ఆధ్వర్యంలో జరిగిన ఈ సదస్సులో జగ్గంపేట సీఐ వైఆర్‌కే శ్రీనివాసరావు విద్యార్థులకు, గుడ్ టచ్-బ్యాడ్ టచ్, ర్యాగింగ్ నివారణ, పోక్సో చట్టాలపై అవగాహన కల్పించారు.



జగ్గంపేట బస్టాండ్‌లో విద్యార్థులకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ శ్రీనివాసరావు

పైపులైన్లు, తాగునీటి కుళాయిల తనిఖీ

గండేపల్లి: మండలంలోని ఉప్పలపాడులో తాగునీటి పైపులైన్లు, కుళాయిలను ఆర్‌డబ్ల్యూఎస్ డీఈ స్వామి, జేఈ అప్పలరాజు, గండేపల్లి ఎంపీడీఓ నాతి బుజ్జి సోమవారం తనిఖీ చేశారు. జలజీవన్ మిషన్ పథకంలో సుమారు రూ.62 లక్షలతో గ్రామంలో పైపులైన్లు, 523 కుళాయి కనెక్షన్లు ఏర్పాటు చేశారు. వేసిన పైపులైన్లు, కుళాయిలు డ్రైనేజీల్లో వేయడంతో పైపులైన్లు దెబ్బతిని తాగునీరు కలుషితవుతోంది. దీనిపై స్థానికులు కలెక్టరేట్‌లో ఫిర్యాదు చేయడంతో అధికారులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ, బీసీ కాలనీల్లో సీసీ రోడ్లను పగులగొట్టి పైపులైన్లు వేయాల్సి ఉండగా అందుకు అవకాశం లేకపోవడంతో డ్రైన్లలో ఏర్పాటు చేశారన్నారు. నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో ఏఓ చంద్రరావు, కార్యదర్శి తరంగిణి పాల్గొన్నారు.



ఉప్పలపాడులో డ్రైనేజీలో ఏర్పాటు చేసిన పైపులైన్, కుళాయిలను పరిశీలిస్తున్న అధికారులు

21 నుంచి నీటి సంఘాల ఎన్నికలు

ప్రత్తిపాడు: మండలంలోని 18 నీటి సంఘాలకు ఈ నెల 21వ తేదీ నుంచి 29వ తేదీ వరకూ ఎన్నికలు నిర్వహించనున్నట్టు నీటి పారుదలశాఖ ఏఈఈ ఎస్‌కే ఇబ్రహీం సోమవారం తెలిపారు. వట్టిగెడ్డ సబ్ డివిజన్ పరిధిలోని మధ్యతరహా సాగు నీటి ప్రాజెక్టు సుబ్బారెడ్డి సాగర్ కుడి ప్రధాన కాలువ, గోకవరం ఏటి కాలువ, ఎడమ ప్రధాన కాలువ (పెద్దిపాలెం), గోకవరం ఏటి కాలువ (లంపకలోవ), సుబ్బారెడ్డి సాగర్ ప్రాజెక్టుకు చెందిన ప్రత్తిపాడు గోవిందపురం - ఏలూరు వెంకటపతిరాజు చెరువులు, ఒమ్మంగి గోపాలుడు - ధర్మవరం రామభద్రరాజు చెరువులు, చిన్న తరహా సాగు నీటి చెరువులైన ప్రత్తిపాడు ధార చెరువు, చిన్నపాటి చెరువు, చెల్లాయ్యమ్మ చెరువు, పెద్ద చెరువు, తమ్మయ్య చెరువు, కొత్త చెరువు, కుదుముల చెరువు, రామానుజుల చెరువు, పుష్కర లిఫ్ట్ ఇరిగేషన్ స్కీం పరిధిలోని కిర్లంపూడి మండలం సింహాద్రిపురం, ధర్మవరం లిఫ్ట్, గొల్లప్రోలు మండలం కొడవలి లిఫ్ట్ పథకాల నీటి సంఘాలకు ఈ నెల 21 నుంచి 23 వరకు ఎన్నికలు జరుగుతాయని ఆయన వివరించారు.

రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో ప్రతిభ

తుని రూరల్: రాష్ట్రస్థాయి రోప్ స్కిప్పింగ్ పోటీల్లో మండలంలోని వి.కొత్తూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకుల బాలికల పాఠశాల విద్యార్థినులు విశేష ప్రతిభ చూపారు. పలు విభాగాల్లో రాణించి 19 పతకాలు సాధించినట్టు పాఠశాల ప్రిన్సిపాల్ పి.నిర్మలకుమారి సోమవారం తెలిపారు. ఈ నెల 8, 9 తేదీల్లో పశ్చిమ గోదావరి జిల్లా భీమవరంలో జరిగిన రాష్ట్రస్థాయి అండర్-14, అండర్-17, అండర్-19 విభాగాల్లో 18 బంగారు, ఒక కాంస్య పతకం సాధించారన్నారు. ప్రతిభ చూపిన విద్యార్థినులు, వారికి తర్ఫీదు ఇచ్చిన పీఈటీలను ప్రిన్సిపాల్ నిర్మల కుమారి, వైస్ ప్రిన్సిపాల్ పద్మసత్యవతి, ఉపాధ్యాయులు అభినందించారు.



విద్యార్థినులను అభినందిస్తున్న ప్రిన్సిపాల్

హరహర మహాదేవ

- శివనామస్మరణతో మార్మోగిన ఆలయాలు
- స్వామివారికి విశేష పూజలు
- గ్రామాల్లో కార్తిక వనసమారాధనలు

ఏలేశ్వరం/రౌతులపూడి/ప్రత్తిపాడు/ప్రత్తిపాడు రూరల్/జగ్గంపేట/తుని/కిర్లంపూడి /తొండంగి/శంఖవరం/అన్నవరం/గోకవరం/కోటనందూరు/: కార్తిక మాసంలో రెండో సోమవారం కావడంతో ఆలయాలకు భక్తులు పోటెత్తారు. తుని, ప్రత్తిపాడు, జగ్గంపేట నియోజకవర్గాల్లోని ఆలయాలు తెల్లవారుజాము నుంచే భక్తులతో కిటకిటలాడాయి. వందలాది మంది భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. మధ్యాహ్నం పలు ఆలయాల వద్ద వనసమారాధనలు నిర్వహించారు. ఏలేశ్వరంలోని రాజరాజేశ్వరీ సమేత రామలింగేశ్వరాస్వామి ఆలయం తెలవారుజాము నుంచి భక్తులతో కిటకిటలాడింది. అర్చకులు శేఖర్, మహేష్ ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. వందలాది మంది భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు. మండలంలోని లింగంపర్తి, సిరిపురం గ్రామాల్లోని శివాలయాలు అయ్యప్పస్వాములు, మహిళలు, భక్తులతో నిండిపోయాయి. ఆలయాల్లోని ధ్వజస్తంభాల వద్ద మహిళలు కార్తిక దీపాలు వెలిగించి ప్రత్యేక పూజలు చేశారు. శివాలయం సమీపంలోని సత్యనారాయణస్వామి ఆలయాలనికి భక్తులు పోటెత్తారు.

రౌతులపూడి మండలంలో..

రౌతులపూడి మండలం శృంగవరం- మెరక చామవరం సమీపంలోని నందనవనంలో వెలసిన నాగలింగేశ్వరస్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసింది. చుట్టు పక్కల గ్రామాల నుంచి వచ్చిన భక్తులు ఆలయం వద్ద ఉన్న కోనేరులో పుణ్యస్నానాలు ఆచరించి స్వామివారిని దర్శించుకున్నారు. స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. దాతల సహకారంతో భక్తులకు అన్నప్రసాదం అందించారు. అలాగే రౌతులపూడి ఉమారామలింగేశ్వరస్వామి ఆలయంలోనూ విశేష పూజలు నిర్వహించారు.

ప్రత్తిపాడు మండలంలో...

ప్రత్తిపాడులోని అన్నపూర్ణ సమేత విశ్వేశ్వరస్వామి పంచాయతన ఆలయం భక్తులతో కిక్కిరిసింది. ఉదయం నుంచి ఆలయంలో సామూహిక అభిషేకాలు నిర్వహించారు. గ్రామాల్లోని శివాలయాలల్లో భక్తులు అర్చనలు, అభిషేకాలు చేశారు. మహిళలు రావిచెట్టు, జమ్మి చెట్టు, ధ్వజస్తంభాల వద్ద దీపారాధనలు చేశారు. మండలంలోని ఏలూరు, పెదశంకర్లపూడి గ్రామాల్లో నగర సంకీర్తన నిర్వహించారు.

కోటనందూరు, జగ్గంపేట మండలాల్లో..

కోటనందూరు మండలంలోని బొద్దవరంలో గౌరీకాశీ జ్ఞానేశ్వర ఆలయం, కోటనందూరులోని భోగలింగేశ్వరస్వామి, కేఓ అగ్రహారంలో విద్యాశంకరస్వామి, అల్లిపూడిలో ఉమామహేశ్వరస్వామి, భీమవరపుకోటలో కామకామేశ్వరిస్వామి ఆలయాలు భక్తులతో కిటకిటలాడాయి. వేదపండితులు స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు. బొద్దవరం, కోటనందూరు శివాలయాల్లో మధ్యాహ్నం అన్నదానం నిర్వహించారు. జగ్గంపేటలో వేంచేసిన సర్వకామదాంబ సమేత ఉమాచంద్రశేఖర్ స్వామి ఆలయానికి తెల్లవారుజాము నుంచి భక్తులు పోటెత్తారు. మండలంలోని పలు గ్రామాల నుంచి భక్తులు తరలివచ్చి స్వామివారిని దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు కొండబాబు స్వామివారికి విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

తొండంగి, శంఖవరం మండలాల్లో..

తొండంగి మండలంలోని శైవక్షేత్రాలు భక్తులతో కిటకిటలాడాయి. ఒంటిమామిడి విశ్వేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు, పంచామృతాభిషేకాలు నిర్వహించారు. తొండంగి రామలింగేశ్వరస్వామి, గోపాలపట్నం ఉమారామలింగేశ్వరస్వామి, పి.ఇ.చిన్నాయపాలెం, పైడికొండ, ఎ.కొత్తపల్లి, అద్దరిపేట, పంపాదిపేట, బెండపూడి గ్రామాల్లో శివాలయాల్లో భక్తులు పూజలు నిర్వహించారు. శంఖవరం మండలంలోని కత్తిపూడి, వేళంగి, మండపం తదితర గ్రామాల్లో శివాలయాలకు భక్తులు పోటెత్తారు. స్వామి వారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు స్వీకరించారు.

గోకవరం, కిర్లంపూడి మండలాల్లో...

గోకవరంలో పర్వతవర్ధినీ సమేత రామలింగేశ్వర స్వామి ఆలయానికి భక్తులు బారులు తీరారు. ఆలయ ప్రాంగణంలోని కోనేరులో మహిళలు కార్తిక దీపాలు విడిచిపెట్టారు. గోకవరం రమాసత్యనారాయణ స్వామి ఆలయంలో కొలువైన ఉమా సమేత గోకర్ణేశ్వరస్వామి వారి ఆలయానికి విశేష సంఖ్యలో భక్తులు పోటెత్తారు. కొత్తపల్లిలో రెడ్డిరాజుల కాలం నాటి బాలాత్రిపుర సుందరీ సమేత రాజలింగేశ్వరస్వామి ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. కిర్లంపూడి మండలం భూపాలపట్నంలో వేంచేసిన రామలింగేశ్వరస్వామి ఆలయం వద్ద సోమవారం భారీ అన్నసమారాధన నిర్వహించారు. కార్తికమాసంలో రెండో సోమవారం సందర్భంగా తెల్లవారుజాము నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. ఆలయ అర్చకులు స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించారు. స్థానిక పరిసర గ్రామాలకు చెందిన భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అన్నప్రసాదాన్ని స్వీకరించారు. భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాటు చేశారు.

ఆకట్టుకున్న చిన్నారుల నృత్యప్రదర్శన

కార్తిక సోమవారం సందర్భంగా రత్నగిరి కళావేదిక మీద సాంస్కృతిక ప్రదర్శనలు ఏర్పాటు చేశారు. చిన్నారులు భరతనాట్యం, కూచిపూడి నృత్యాలతో ఆకట్టుకున్నారు.



ఏలేశ్వరం శివాలయంలోని ధ్వజస్తంభం వద్ద పూజలు చేస్తున్న మహిళలు



జగ్గంపేటలో విశేష అలంకరణలో చంద్రశేఖరస్వామి



రౌతులపూడి మండలం నందనవనంలో భక్తులు కోలాహలం



రాచపల్లిలో అరుణాచలేశ్వరస్వామి దర్శనానికి బారులు తీరిన భక్తులు

జియో ట్యాగింగ్ సర్వేలో తుని మండలానికి ప్రథమ స్థానం



కేఓ మల్లవరంలో జియో ట్యాగింగ్ సర్వేను పరిశీలిస్తున్న అధికారులు

తుని రూరల్: గృహ జియో ట్యాగింగ్ సర్వేలో తుని మండలం జిల్లాలో ప్రథమ స్థానంలో నిలిచింది. తుని మండలంలో 28456 గృహాలకు గాను సోమవారం సాయంత్రానికి 11054 (38.85 శాతం) ఇళ్లకు జియో ట్యాగింగ్ పూర్తయినట్టు ఎంపీడీఓ సాయి నవీన్ కుమార్ తెలిపారు. తర్వాత స్థానాల్లో వరుసగా గండేపల్లి 35.05 శాతం, పెద్దాపురం రూరల్ 28.47 శాతంతో ఉన్నాయని వివరించారు. కేఓ మల్లవరం, రాపాక, దొండవాక, రేఖవానిపాలెం, తదితర గ్రామాల్లో జరుగుతున్న జియో ట్యాగింగ్ సర్వేను ఎంపీడీఓ సాయి నవీన్ కుమార్, ఈఓపీఆర్‌డీ మరిడియ్య క్షేత్రస్థాయిలో పరిశీలించారు. సర్వే సిబ్బందికి పలు సూచనలు చేశారు. సర్వేలో సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

యువతి అదృశ్యంపై కేసు

గండేపల్లి: యువతి అదృశ్యంపై కేసు నమోదు చేసినట్టు గండేపల్లి పోలీసులు సోమవారం తెలిపారు. మండలంలోని మల్లేపల్లికి చెందిన 20 ఏళ్ల యువతి గత శుక్రవారం రాత్రి ఇంటి నుంచి వెళ్లిపోయింది. తల్లిదండ్రులు బంధువుల ఇళ్లలో వెతికినా ఆమె ఆచూకీ లభించలేదు. దీంతో యువతి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు తెలిపారు.

ఆలయానికి వెండి శఠగోపం సమర్పణ



ఆలయ కమిటీ సభ్యులకు వెండి శఠగోపం అందిస్తున్న దాత

జగ్గంపేట: మండలంలోని సీతానగరంలో నిర్మిస్తున్న సుబ్రహ్మణ్యస్వామి ఆలయానికి జగ్గంపేటకు చెందిన వ్యాపారవేత్త జీను పెదరాంబాబు, అతని కుమారుడు జీను వెంకటేష్ వెండి శఠగోపం సమర్పించారు. సోమవారం ఆలయ కమిటీ సభ్యులకు శఠగోపాన్ని అందజేశారు. ఈ నెల 17న ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ నిర్వహించనున్నట్టు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

ఘనంగా జాతీయ విద్యా దినోత్సవం



జగ్గంపేటలో అబుల్ కలాం ఆజాద్ చిత్ర పటానికి నివాళులర్పిస్తున్న అధ్యాపకులు

జగ్గంపేట: స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ చెన్నారావు ఆధ్వర్యంలో విద్యావేత్త డాక్టర్ మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆజాద్ విద్యారంగానికి చేసిన సేవలను, విద్యారంగంలో తీసుకువచ్చిన మార్పులను విద్యార్థులకు వివరించారు. కార్యక్రమంలో పీవీవీ సత్యనారాయణ, వైస్ ప్రిన్సిపాల్ సీహెచ్ బాలరాజు, కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.

ఘనంగా జాతీయ విద్యాదినోత్సవం

తొండంగి: మండలంలోని పెరుమాళ్లపురం ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో సోమవారం జాతీయ విద్యా దినోత్సవం ఘనంగా నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ఎంవీకే మెహర్ ఆధ్వర్యంలో మౌలానా అబుల్ కలాం ఆజాద్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అధ్యాపకులు ఆర్.జగదీష్ ప్రకాష్, పీవీ కృష్ణారావు, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి టి.రాము తదితరులు పాల్గొన్నారు.

పొలంబడితో ఆరోగ్యకరమైన దిగుబడులు

కిర్లంపూడి: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న గ్యాప్ పొలంబడి కార్యక్రమంతో ఆరోగ్యకరమైన దిగుబడులు సాధించవచ్చని వ్యవసాయ సంయుక్త సహాయకులు ఎన్.విజయ్‌కుమార్ అన్నారు. మండల పరిధి ముక్కొల్లులో మండల వ్యవసాయాధికారి జోకా అమృత ఆధ్వర్యంలో సోమవారం క్షేత్ర దినోత్సవం నిర్వహించారు. రైతులకు పంటల సాగు, అధిక దిగుబడికి తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఎఫ్‌టీసీ డీడీ హరి, ఏడీఏలు దైవకుమార్, ఎఫ్‌టీసీ ఏడీఏ మాధవి, ఎంఏఓ సంజయ్, ఏఈఓ ఆకుల సురేష్, వీఏఏ అభి, జీబీఎస్ఎఫ్ సిబ్బంది పాల్గొన్నారు.